
సాక్షి ప్రకాశం
శనివారం । 3 । మే । 2025



వక్ఫ్ భూములు ఉఫ్!

పొదిలిలో వక్ఫ్ భూములపై అక్రమార్కులు గద్దల్లా వాలుతున్నారు. ఆక్రమణదారులకు నోటీసులిచ్చి అధికారులు సరిపెట్టుకుంటున్నారు. ఆక్రమణలు తొలగించాలన్న హైకోర్టు ఆదేశాలనూ అమలు చేయడం లేదు. - 10లో..



ప్రయాణికుల కస్సుబస్సు

అమరావతి పునర్నిర్మాణ సభకు జనాన్ని తరలించేందుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను పంపడంతో జిల్లాలోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. - 10లో..

గరిష్టం/కనిష్టం
39 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి కల్పించాలి

ఒంగోలు సిటీ: జిల్లాలో అర్హులైన జూనియర్ అసిస్టెంట్‌లకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించాల్సిందిగా డీఈవో కిరణ్‌కుమార్‌కు ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.శివలీల శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా (పాత జిల్లా పరిధి)లో ఆరు నెలలుగా సీనియర్ అసిస్టెంట్ పోస్ట్ ఖాళీగా ఉందన్నారు. జూనియర్ అసిస్టెంట్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో అసోసియేట్ ప్రెసిడెంట్ పీ.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ చైతన్య, కోశాధికారి ఎస్.పేరయ్య ఉన్నారు.

కిశోర బాలల రక్షణ ప్రధానం

- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: కిశోర బాలల రక్షణ చర్యలు ప్రధాన అజెండాగా పెట్టుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ కమిటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కిశోర వికాసం పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు, బాలురు 11 నుంచి 18 సంవత్సరాల వయస్సున్న వారిని అభివృద్ధి చేయటమే కిశోర వికాసం లక్ష్యమన్నారు. వారి రక్షణ, సాధికారతను పెంపొందించడం, బాల్య వివాహాలను అడ్డుకోవటం, ఆరోగ్యం, విద్య, పోషణ నైపుణ్యాలు, భద్రత, ఉపాధికి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి బి.హేన సుజన, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్ కుమార్, వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్, సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

4వ రోజుకు చేరిన సీహెచ్‌ఓల సమ్మె



సమ్మెలో పాల్గొన్న సీహెచ్‌ఓలు

ఒంగోలు టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలుఅందిస్తున్న విలేజీ క్లినిక్‌ల్లో పని చేస్తున్న సీహెచ్‌ఓల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారం 4వ రోజుకు చేరింది. జిల్లాలోని 538 మంది సీహెచ్‌ఓలు ఈ సమ్మెలో పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు తీర్చేంత వరకు సమ్మె కొనసాగిస్తామని ఏపీఎంసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.రాజేష్ తెలిపారు. ప్రభుత్వం దిగివచ్చేదాకా శాంతియుత నిరసనలు కొనసాగిస్తామన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా తమకు ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు నిర్మల, కార్యదర్శి ప్రసన్న, కో ఆర్డినేటర్ దీప్తి, కామేష్, నవీన్, రామాంజనేయులు పాల్గొన్నారు.



సింగరాయకొండలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మద్యం షాపులోనే నిబంధనలకు విరుద్ధంగా మద్యం తాగుతున్న మందుబాబులు



త్రోవగుంట గ్రామంలో బడ్డీ కొట్ల వద్ద మద్యం తాగుతున్న మద్యం ప్రియులు



యర్రగొండపాలెంలో మద్యం దుకాణం ఎదురుగా అనధికారిక సిట్టింగ్



కొణిజేడులో మద్యం దుకాణం నుంచి సమీప గ్రామంలోని బెల్టు షాపునకు గోనె సంచిలో మద్యం బాటిల్స్‌ను బైక్‌పై తరలిస్తున్న వ్యక్తులు

కిక్కెక్కిన జేబులు!

వీధికో బెల్టుషాపులు వెలుస్తుండడంతో పట్టణాలు, గ్రామాలు మత్తులో జోగుతున్నాయి. ప్రతీ పల్లెలో, పట్టణాల పరిధిలోని కాలనీల్లోని బడ్డీ కొట్టుకు వెళ్తే కావాల్సిన బ్రాండ్‌లు లభ్యమవుతున్నాయి. ఫోన్‌కొడితే చాలు క్షణాల్లో ఇంటి ముంగిటకు మందుబాటిళ్లు వచ్చి చేరుతాయి. పలు వైన్‌షాపుల యజమానులు ఆటోల ద్వారా మద్యాన్ని ఊరూరా సరఫరా చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో బెల్టుషాపు ఏర్పాటు చేసేందుకు వేలం వేస్తున్నారు. ఈ దందా అంతా అధికార కూటమి నేతల కనుసన్నల్లో సాగుతున్నాయి. మద్యం కిక్కుతో తమ జేబులు నింపుకుంటూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో బెల్టు దుకాణాలకు అడ్డేలేకుండా పోతోంది.

- వీధికో బెల్టు షాపు.. బడ్డీ కొట్లే కేరాఫ్ అడ్రస్‌లు
- కూటమి నేత కనుసన్నల్లో యథేచ్ఛగా మద్యం వ్యాపారం
- మద్యం దుకాణాల్లో అనధికార సిట్టింగులు
- బెల్టుషాపుల్లో రూ.20 నుంచి రూ.100 వరకు అధిక ధరలకు అమ్మకాలు
- త్రిపురాంతకం మండలంలో బెల్టుషాపు వ్యవహారంలో చితక్కొట్టుకున్న తమ్ముళ్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీని తీసుకొచ్చింది. ప్రజలకు విద్య, వైద్యం అందించడానికి బదులుగా నాణ్యమైన మద్యం పేరుతో ఇంటి వద్దకే మద్యాన్ని అందించే ఏర్పాటు చేసింది. పచ్చ పార్టీ ఎమ్మెల్యేలకు, వారి అనుచరులకు మద్యం వ్యాపారాన్ని కట్టబెట్టింది. వీధివీధికి బెల్టు షాపులను ప్రోత్సహిస్తూ అదేదో పెద్ద ఘనకార్యంగా గొప్పగా చెప్పుకుంటోంది. జిల్లాలో మొదట 171 మద్యం షాపులకు అనుమతి ఇచ్చారు. గీత కార్మికులకు 10 శాతం షాపులను కేటాయించడంతో మరో 17 షాపులు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకాశం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాలపాడు గ్రామానికి చెందిన ఆళ్లదాసు శ్రీను అనే గీత కార్మికుడికి లాటరీతో సంబంధం లేకుండా ఒక షాపు మంజూరు చేశారు. ఈ షాపుతో కలుపుకొని గీత కార్మికులకు ఇచ్చిన షాపుల సంఖ్య 18కు చేరింది. మొత్తం మీద 189 మద్యం దుకాణాలు ఉన్నాయి. జిల్లాలోని 730 గ్రామ పంచాయతీలుండగా 2 వేలకు పైగా బెల్టు షాపులు ఏర్పాటు చేసుకొని వందల కోట్ల రూపాయల మద్యాన్ని విక్రయిస్తున్నారు. మంచినీరు దొరకని గ్రామాల్లో కూడా ఇప్పుడు కావాల్సినంత మద్యం దొరుకుతుంది. జిల్లాలో అధికారికంగా రూ. 3.3 కోట్లు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. నెలకు రూ. 100 కోట్లకుపైగా విక్రయాలు సాగుతున్నాయి.. ఇక ఒంగోలు నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ సెంటర్, గుంటూరు రోడ్డులోని ఒక రాజకీయ పార్టీ ఆఫీసు ఎదురుగా, ఇందిరమ్మ కాలనీలో ఒక ఇంటిలో, బలరాం కాలనీ, శివారు ప్రాంతంలోని నల్లవాగు దారిలో ఆర్టీఏ కార్యాలయం సమీపంలో, పేర్నమిట్ట, త్రోవగుంటల్లో బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. ఒంగోలు నగరంలోనే 21 మద్యం దుకాణాలుండగా మరో పాతికకు పైగా బెల్టు షాపులున్నాయి. మద్యం దుకాణం దాకా వెళ్లి తాగలేని వారికి ఇంటి దగ్గరకు మందు తెచ్చి ఇస్తున్నారు. దాంతో గతంలో రోజుకోసారి మద్యం తాగే వారు పొద్దస్తమానం ఎప్పుడు కావాలంటే అప్పుడు పీకలదాకా తాగుతున్నారు.

జోరుగా మొబైల్ బిజినెస్...

జిల్లాలోని అన్నీ పట్టణాలు, గ్రామాల్లో జోరుగా మొబైల్ మద్యం బిజినెస్ జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మద్యం దుకాణాలు ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తెరచి ఉంచాలి. ఆ తరువాత దుకాణాలు తెరచి ఉంచకూడదని నిబంధనలు చెబుతున్నాయి. దీంతో తెల్లవారుజామున 4 నుంచి 9 గంటల వరకు, రాత్రి 10 తరువాత నుంచి తిరిగి తెల్లవారుజాము వరకు మద్యం దుకాణాల పక్కనే ఉన్న బీడీ బంకుల్లో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా మద్యం దుకాణాలు, బెల్టు షాపుల నిర్వాహకులకు ఒక్క ఫోన్ చేస్తే చాలు ఇంటి వద్దకే మందులు తెచ్చి విక్రయిస్తున్నారు. మరికొందరు మోటారు బైకుల మీద తిరుగుతూ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని కూడా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.



చీమకుర్తి మెయిన్‌రోడ్డు పక్కనే బెల్ట్‌షాపుల వద్ద మందుబాబుల సందడి

జోరుగా నిషా వ్యాపారం...

కొండపి నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన కీలక నేత ఆధీనంలోనే మద్యం దుకాణాలు నడుస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో 6 మండలాలుండగా సింగరాయకొండ, పొదిలి, ఒంగోలు ఎక్సైజ్ పరిధిలో మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ మద్యం దుకాణాలన్నీ ఆయన చేతుల్లోనే ఉన్నట్టు చెబుతున్నారు. స్థానిక టీడీపీ నాయకులకు చేతులు తడిపి ఊరూరా బెల్టు షాపులు తెరిచారు. బహిరంగంగా మద్యం విక్రయిస్తున్నారు. సుమారు 400 బెల్టు షాపులు పెట్టి మద్యం విక్రయిస్తున్నారంటే ఇక్కడ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

బెల్టు షాపుల కోసం చితక్కొట్టుకున్న తెలుగు తమ్ముళ్లు:

పశ్చిమ ప్రకాశంలో నిత్యం వార్తల్లో ఉండే యర్రగొండపాలెం నియోజకవర్గంలో బెల్టుషాపుల కోసం తెలుగు తమ్ముళ్లు కొట్టుకోవడం సంచలనం సృష్టించింది. నియోజకవర్గంలోని త్రిపురాంతకం మండలం మిట్టపాలెం గ్రామంలో దేవుడి పేరుతో బెల్టుషాపు కోసం వేలం పాట వేశారు. టీడీపీ నేత రవీంద్ర వర్గానికి చెందిన వ్యక్తులకు వేలంపాటలో షాపు దొరికింది. అయితే మరో నేత, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు వర్గం దాన్ని లెక్క చేయకుండా గ్రామ కట్టుబాటుకు వ్యతిరేకంగా బెల్టు షాపు పెట్టి మద్యం విక్రయిస్తున్నాడు. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. చిత్తుచిత్తుగా కొట్టుకున్నారు. ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ విషయం పార్టీ పెద్దల దాకా పోయినప్పటికీ ఎప్పటిలాగే ఎవరి ముందు వారికి అనుకూలంగా మాట్లాడి పంపించినట్లు ప్రచారం జరుగుతోంది.

ఆ రెస్టారెంట్‌లోనే కొనుక్కోవాలి...

గిద్దలూరు నియోజకవర్గంలో అయితే అధికార పార్టీ నేతకు చెందిన రెస్టారెంటులోనే మద్యం విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అది కూడా 70 నుంచి 100 రూపాయల వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గిద్దలూరు మండలంలో 8 మద్యం దుకాణాలుండగా పట్టణంలో 5 దుకాణాలున్నాయి. ఈ దుకాణాల్లో బీరు కానీ, బ్రాండెడ్ మద్యం కానీ విక్రయించకుండా సదరు నేత రెస్టారెంట్‌లోనే విక్రయించాలని హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. అయినా ఎక్సైజ్ అధికారులు ఎవరూ ఇటువైపు తిరిగి చూడడంలేదని చెప్పుకుంటున్నారు. అధికార పార్టీ వారికి ఒక నిబంధన, లైసెన్స్‌దారులకు మరొక నిబంధన ఏమిటని చెవులు కొరుక్కొంటున్నారు.

ఆదాయం కోసం పేదల జీవితాలు బుగ్గి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం ధరలు పెంచి, దుకాణాల సంఖ్యను తగ్గించి, బెల్టుషాపులను నిరోధించాం. నిర్దిష్టమైన సమయం పెట్టి మద్యం విక్రయాలను నియంత్రించాం. ఎన్నికల సమయంలో మద్యం ధరలు తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మద్యం రేట్లు మరింత పెంచారు. కూటమి ప్రభుత్వంలో ఊరూరా గొందులు, సందుల్లో కూడా బెల్టుషాపులు పెట్టి మరీ 24 గంటలూ మద్యం విక్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునేందుకు పేదల జీవితాలను చంద్రబాబు బుగ్గి చేస్తున్నాడు.

– బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు



గిద్దలూరు నియోజకవర్గంలోని రాచర్లలో మద్యం బెల్టుషాపు



కొనకనమిట్ల మండలంలో ఆటోలో తరలిస్తున్న మద్యం

నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగులు

మద్యం విక్రయాల విషయంలో నిబంధనలను ఖాతరు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దాదాపుగా జిల్లా అంతటా మద్యం దుకాణాల్లో మందుబాబుల కోసం సిట్టింగులు ఏర్పాటు చేశారు. సౌకర్యాన్ని బట్టి మద్యం దుకాణానికి వెనక వైపు కుర్చీలు వేసి కూర్చోబెట్టి తాగిస్తున్నారు. చివరికి బెల్టుషాపుల్లో కూడా సిట్టింగు పెట్టి వ్యాపారం చేస్తున్నారు. అయినా ఎక్సైజ్ శాఖ అధికారులు ఎలాంటి తనిఖీలు చేయడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. మార్కాపురం ఎక్సైజ్ ఏఈఎస్ మీద విపరీతంగా ఆరోపణలు వినవస్తున్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం విక్రయిస్తున్న దుకాణాల మీద చర్యలు తీసుకోకుండా ముడుపులు తీసుకొని వెళ్లిపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది.



వైపాలెంలో మద్యం దుకాణంలో సిట్టింగ్

కౌంట్ డౌన్ ప్రారంభమైందా?

- వీరయ్య చౌదరి హత్య కేసులో విచారణ పూర్తయినట్లేనా
- పోలీసుల అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు
- నిందితులంతా అధికార టీడీపీ వారే కావడంతో సర్వత్రా ఆసక్తి
- పోలీసుల అదుపులోనే ప్రధాన అనుమానితులు
- పాత్రధారుల కోసం కొనసాగుతున్న గాలింపు
- జిల్లా టీడీపీ నేతల్లో కలవరం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య జరిగి 12 రోజులైంది. ఈ కేసులో ఇప్పటి వరకు పలువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అన్నీ కోణాల్లో విచారణ చేస్తున్నారు. హత్యకు గురైన వీరయ్య చౌదరి, హత్యకు ప్లాన్ చేసినట్లు చెబుతున్న ప్రధాన అనుమానితులంతా అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన వారే కావడంతో ఈ కేసుపై ఎనలేని ఆసక్తి నెలకొంది. అంతేకాకుండా హతుడు వీరయ్య చౌదరికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సన్నిహితుడు కావడం పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు. ఇప్పటికే ప్రధాన అనుమానితుడిగా ఉన్న అమ్మనబ్రోలు వాసి, టీడీపీ యువ నాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అమ్మనబ్రోలుకు చెందిన మరో టీడీపీ సానుభూతిపరుడైన హవాలా వ్యాపారి కోసం గాలిస్తున్నారు. హత్యలో ప్రధాన పాత్ర పోషించినట్లు చెబుతున్న కొప్పోలు వాసి కోసం వైజాగ్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వీరితో పాటుగా దాదాపుగా 150 మందికి పైగా అనుమానితులను తీసుకొచ్చి విచారిస్తూనే ఉన్నారు. అయితే పోలీసులు ఈ కేసు గురించి ఎలాంటి అధికారిక ప్రకటన చేయకపోవడం గమనార్హం. అమరావతికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వచ్చి వెళ్లారు. మూడు రోజులుగా పోలీసులు పీఎం సభ బందోబస్తులో బిజీగా ఉన్నారు. ఆ పని కాస్త అయిపోవడంతో ఇక వీరయ్య చౌదరి కేసులో కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే తీవ్ర జాప్యం కావడంతో తమ వద్దనున్న నిందితులపై కేసు నమోదు చేసే అవకాశాలున్నట్లు సమాచారం.



వీరయ్య చౌదరి (ఫైల్)

నిందితులంతా టీడీపీ నాయకులే...

టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసులో పోలీసులు విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. హత్యకు గురైన వీరయ్య చౌదరి టీడీపీలో చాలా క్రియాశీలక నాయకుడు. ఆయన హత్య కేసులో ఉన్న అమ్మనబ్రోలుకు చెందిన ప్రధాన అనుమానితుడు కూడా టీడీపీలో క్రియాశీలక నాయకుడు కావడం గమనార్హం. ఆయన తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అంతే కాకుండా సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఆయనతో పాటుగా ఈ హత్య కేసులో డబ్బులు సమకూర్చినట్లు ప్రచారం జరుగుతున్న మరో ప్రధాన అనుమానితుడు కూడా తెలుగుదేశంతో సన్నిహిత సంబంధాలు కలిగిన వ్యక్తిగా ప్రచారం జరుగుతోంది. హత్య చేసిన నిందితులకు డబ్బులు అందజేసినట్లుగా చెబుతున్న ఓ సిద్ధాంతి కూడా టీడీపీకి చెందినట్లు సమాచారం. ఆయన ప్రస్తుతం పోలీసుల అదుపులోనే ఉన్నాడు. ఇలా పైనుంచి కింద దాకా ఈ హత్య కేసులో అంతా టీడీపీ వారే కావడం జిల్లాలో సంచలనం సృష్టిస్తోంది. అందుకే ఈ కేసు గురించి టీడీపీ ప్రజా ప్రతినిధులు ఎక్కడా నోరువిప్పి మాట్లాడడం లేదు.

విచారణ ఆలస్యంపై అనుమానాలు...

నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి హత్య కేసులో విచారణ జాప్యం అవుతుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏప్రిల్ 22వ తేదీ రాత్రి 7.30 గంటల సమయంలో వీరయ్య చౌదరి హత్య జరిగింది. హత్య జరిగిన రోజు రాత్రే రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఒంగోలుకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. పోలీసు అధికారులతో మాట్లాడారు. హత్య జరిగిన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మరుసటి రోజు అంత్యక్రియలు పూర్తయ్యే వరకు హోం మంత్రితో పాటుగా పోలీసు ఉన్నతాధికారులు ఇక్కడే ఉన్నారు. మరుసటి రోజు వీరయ్య అంత్యక్రియలకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు వీరయ్య హంతకులను ఎంతటి వారైనా వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. అసలు హంతకులు నేల మీద ఉండడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అయితే కేసు లోతుల్లోకి వెళితే అంతా టీడీపీ నాయకులే ఉండడంతో పోలీసు అధికారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదని తెలుస్తోంది. అందువల్లనే కేసు విచారణ ఆలస్యమవుతోందా అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ నాయకుల గుండెల్లో గుబులు...

వీరయ్య చౌదరి హత్య జరిగినప్పటి నుంచే టీడీపీ నాయకుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తుందన్న ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఈ కేసులో హత్యకు గురైన నాయకుడు, హత్యకు ప్లాన్ చేసిన వారు టీడీపీ నాయకులే కావడంతో పార్టీ నాయకులు, శ్రేణుల గుండెల్లో రాయి పడ్డట్టయిందని చెబుతున్నారు. అంతేకాకుండా వీరయ్య హత్య కేసులో ప్రధాన అనుమానితుడిగా పోలీసుల అదుపులో ఉన్న టీడీపీ యువ నాయకుడితో జిల్లా ఎమ్మెల్యేలకు, ముఖ్యులకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే అనుమానితుడితో కలిసి మాట్లాడిన వారిని, భోజనాలు చేసిన వారిని, ఫొటోలు తీయించుకున్న వారిని పోలీసులు విచారణకు పిలుస్తుండడం మరింత ఆందోళనకు గురిచేస్తోందని చెప్పుకుంటున్నారు. కేసు ఫైనల్ అయ్యే వరకు ఈ నాయకులు నిద్ర పోయే పరిస్థితి కూడా లేదన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. మొత్తం మీద వీరయ్య చౌదరి కేసు ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని టీడీపీ శ్రేణులు బెంగపడిపోతున్నారని ప్రచారం జరుగుతోంది.

మంత్రి గారికి ముహూర్తం కుదర్లేదట..!



మార్కాపురం జీజీహెచ్ వైద్యశాల



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఐసీయూ వార్డులోని వెంటిలేటర్ బెడ్లు

- అన్నీ సిద్ధంగా ఉన్నా ముహూర్తం లేక ప్రారంభం కాని ఐసీయూ వార్డ్
- జీజీహెచ్‌లో 12 వెంటిలేటర్ల ఏర్పాటు
- ప్రస్తుతం అత్యవసరమైతే ఒంగోలుకు తరలింపు

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్‌లో సుమారు నెలరోజుల క్రితం ఐసీయూ వార్డును ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, అందులో 12 వెంటిలేటర్లను బిగించారు. వాటికి అనుసంధానంగా బీపీ మిషన్, పల్స్ మిషన్, ఆక్సీమీటర్లను అమర్చారు. అయితే సంబంధిత శాఖా మంత్రికి ముహూర్తం కుదరకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు అంబులెన్స్‌లో ఒంగోలుకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. మార్కాపురం జీజీహెచ్‌లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మూడు ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేయడంతోపాటు మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టి జిల్లా వైద్యశాలను జీజీహెచ్‌గా మార్చి సుమారు 72 మంది వైద్యులను, ప్రొఫెసర్లను నియమించారు. అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. దీంతో పశ్చిమ ప్రకాశంతోపాటు కనిగిరికి చెందిన వారు కూడా ఇక్కడికి వచ్చి కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా పొందారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మెడికల్ కాలేజీపై చిన్నచూపు చూడటంతో అర్ధాంతరంగా ఆగిపోయింది. జీజీహెచ్‌లో పనిచేస్తున్న సుమారు 45 మంది వైద్యులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. 500 పడకలతో ఏర్పాటుచేసిన జీజీహెచ్ వైద్యులు లేక, ఓపీ తగ్గి వెలవెలపోతోంది. మరోవైపు గత ప్రభుత్వంలోనే ఐసీయూ వార్డులు, వెంటిలేటర్లు మంజూరు చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో వాటిని నిలిపివేశారు. పశ్చిమ ప్రకాశంలో నల్లమల అటవీ ప్రాంతం, ఘాట్ రోడ్డు ఎక్కువగా ఉండటంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. అనంతపురం, విజయవాడ నేషనల్ హైవే, మార్కాపురం-ఒంగోలు స్టేట్ హైవే, దోర్నాల-శ్రీశైలం, దోర్నాల-ఆత్మకూరు, గిద్దలూరు-నంద్యాల, యర్రగొండపాలెం-మాచర్ల ఘాట్ రోడ్డు ఉంది. ఈ ప్రాంతంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగి తీవ్ర రక్తస్రావమై క్షతగాత్రులు ప్రాణాపాయ స్థితిలో జీజీహెచ్‌కు వస్తారు. ఇటువంటి పరిస్థితుల్లో వారి ప్రాణాలను నిలబెట్టేందుకు ఐసీయూ వార్డుల్లో వెంటిలేటర్లు తప్పనిసరి. వీటితోపాటు పలువురు ఆత్మహత్యలకు పాల్పడటం, పురుగు మందు తాగడం తదితర కారణాలతో ప్రాణాపాయ పరిస్థితుల్లో జీజీహెచ్‌కు వస్తారు. వీరికి కూడా ప్రాణాలు నిలబెట్టేందుకు వెంటిలేటర్‌పై ఉంచాలి. అయితే ఐసీయూ వార్డులో వెంటిలేటర్లు ఏర్పాటు చేసి నెల రోజులు దాటినా ప్రజాప్రతినిధులకు డేట్ కుదరక ప్రారంభించకపోవడంతో జీజీహెచ్‌కు ప్రాణాపాయ స్థితిలో వచ్చినవారు ఒంగోలుకు వెళ్లాల్సిన పరిస్థితి. త్వరగా ఐసీయూ వార్డును ప్రారంభించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

మార్కాపురం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఐసీయూ వార్డ్, 12 వెంటిలేటర్లను త్వరలో ప్రారంభించి రోగులకు అందుబాటులోకి తెస్తాం. జీజీహెచ్‌లో ప్రస్తుతం ఉన్న వైద్యులతోనే మంచి వైద్యసేవలు అందిస్తున్నాం. మందుల కొరత లేదు.

– డాక్టర్ రామచంద్రరావు, సూపరింటెండెంట్, జీజీహెచ్, మార్కాపురం

వక్ఫ్ భూములు ఉఫ్!


ఆక్రమణకు గురవుతున్న వక్ఫ్ భూములు

- పొదిలిలో వక్ఫ్ భూములపై గద్దల్లా వాలుతున్న అక్రమార్కులు
- ఆక్రమణదారుల్లో కొందరికి నోటీసులిచ్చి సరిపెట్టిన అధికారులు
- ఆదాయానికి గండి పడుతున్నా చోద్యం చూడటంపై విమర్శలు
- ఆక్రమణల తొలగింపుపై హైకోర్టు ఆదేశాలను అమలుచేయని వైనం
- రికార్డులు లేవంటూ విచారణ వాయిదా వేసిన డిప్యూటీ కలెక్టర్

పొదిలి:

వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతమవుతున్నా అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఒకరిని చూసి మరొకరు వక్ఫ్ భూముల్లో పాగా వేస్తుండటంతో ఆస్తులు తరిగిపోవడంతోపాటు ఆదాయానికీ భారీగా గండి పడుతోంది. భూములు అన్యాక్రాంతమవుతున్న తీరుపై ముస్లింలు గగ్గోలు పెడుతున్నా సంబంధిత శాఖ అధికారులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశమవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. పొదిలి మండలానికి సంబంధించి ఒంగోలు రోడ్డులోని దర్గా దగ్గర కాలువ నుంచి మర్రిపూడి రోడ్డు వరకు, బుచ్చనపాలెం సమీపంలో కొంత మేర, కాటూరివారిపాలెం సమీపంలో మొత్తం 322.24 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయి. సర్వే నంబర్ 285, 325-1,325-2,325-3, 81-1, 407-2, 483-2, 806, 820, 885, 888-1, 888-2,888-4, 888-6, 889-1లో విస్తరించి ఉన్న ఈ భూములపై పర్యవేక్షణ కొరవడటంతో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. ఆపై తప్పుడు రికార్డులు సృష్టించి భూములు తమవని పేర్కొంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

ఆక్రమణల జోరు..

ఒంగోలు-కర్నూలు రోడ్డులోని టైలర్స్ కాలనీ-రైల్వే బ్రిడ్జి మధ్యలో ఉన్న వక్ఫ్ భూములు ఎక్కువ భాగం ఆక్రమణకు గురయ్యాయి. గతంలో కొందరు ఆక్రమణదారులు చేసిన ప్రయత్నాలను అప్పటి అధికారులు అడ్డుకున్నారు. కానీ ప్రస్తుతం అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. అధికారులు కేవలం నోటీసులిచ్చేందుకు పరిమితం కావడం.. నోటీసులు షరా మామూలేననే ధోరణిలో ఆక్రమణదారులు ఉండటంతో విలువైన ఆస్తులకు రక్షణ లేకుండాపోయింది. పొదిలిలో 52 మంది ఆక్రమణదారులకు అధికారులు నోటీసులు పంపించారు. మరో 40 మంది భూఆక్రమణదారులకు సైతం నోటీసులు ఇవ్వాల్సి ఉన్నా ఆ దిశగా అడుగులు పడలేదు. ఆక్రమిత భూములను గుర్తించి నిందితులపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఉన్నతాధికారులు లైట్ తీసుకోవడంపై స్థానిక ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డిప్యూటీ కలెక్టర్ విచారణ వాయిదా

వక్ఫ్ భూములు అన్యాక్రాంతమవుతున్న తీరు, ఆక్రమణదారుల వ్యవహార శైలి గురించి పొదిలి పంచాయతీ వార్డు మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు బాషా పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వక్ఫ్ సంస్థ భూములను కాపాడాలని కోరారు. దీంతో ఎట్టకేలకు డిప్యూటీ కలెక్టర్ ఇటీవల విచారణకు వచ్చారు. అయితే రికార్డులు అందుబాటులో లేవని, తహసీల్దార్ సెలవులో ఉన్నారనే కారణాలతో విచారణ వాయిదా వేశారు. మళ్లీ విచారణ ఎప్పుడు చేపడతారో స్పష్టత లేదు.

ఆదాయానికి గండి

వక్ఫ్ భూముల కౌలు వేలం ద్వారా ప్రతి సంవత్సరం లక్షల రూపాయల్లో ఆదాయం వస్తోంది. ఒక్కో ఏడాది రూ.6 లక్షల నుంచి రూ.20 లక్షల మధ్యలో ఆదాయం వస్తున్నట్లు స్థానిక ముస్లిం మత పెద్దలు చెబుతున్నారు. ఈ ఆదాయంలో నుంచే పొదిలిలోని పెద్ద మసీదు నిర్వహణకు కొంత మొత్తాన్ని వినియోగిస్తున్నారు. చిన్నపాటి మరమ్మతు పనులకు సైతం వక్ఫ్ భూముల ఆదాయం నుంచే ఖర్చు చేస్తూ వస్తున్నారు. అయితే భూములు అన్యాక్రాంతం అవుతుండటంతో కౌలు వేలం ఆదాయం తగ్గిపోతోంది. భూవివాదాల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టకపోగా సాధారణ విషయంగా పరిగణిస్తుండటంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్న పరిస్థితి నెలకొంది.


ఒంగోలు రోడ్డులో వక్ఫ్ భూముల్లో కొంత భాగం

ఆక్రమణలు తొలగించేంత వరకు పోరాటం

వక్ఫ్ భూముల్లో ఆక్రమణలు తొలగించేంత వరకు పోరాటం కొనసాగిస్తా. ఎన్నోమార్లు స్థానిక అధికారుల నుంచి జిల్లా అధికారుల వరకు ఆక్రమణలపై ఫిర్యాదు చేశా. కానీ వారు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. సాక్షాత్తూ హైకోర్టు తీర్పును కూడా అధికారులు అమలు చేయడం లేదు. మళ్లీ కోర్టుకు వెళ్లయినా సరే అధికారులు చర్యలు తీసుకునేలా కృషి చేస్తా.

– ముల్లా ఖాదర్‌బాషా,
వైఎస్సార్ సీపీ నాయకుడు

అధికారులు సహకరిస్తేనే ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపునకు సంబంధించి వ్యవహారం తుది దశకు చేరింది. కలెక్టర్, ఎస్పీని కలిసి పలుమార్లు విన్నవించాం. వారు సంబంధిత అధికారులకు ఉత్తర్వులు ఇచ్చారు. స్థానిక అధికారులు, పోలీసుల అండతోనే ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. పని ఒత్తిడి ఉందని వారు చెబుతున్నారు. వారు సహకరిస్తే త్వరలోనే ఆక్రమణలు తొలగిస్తాం.

– అహ్మద్ బాషా,
వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్

ప్రయాణికులు కస్సుబుస్సు


ప్రయాణికులతో కిక్కిరిసిన ఒంగోలు డిపో ఆవరణ

మార్కాపురం టౌన్/పొదిలి:

పునర్నిర్మాణ సభకు జనాన్ని తరలించేందుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను పల్నాడు జిల్లాకు పంపడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సరైన సమయంలో బస్సులు లేక, గమ్యస్థానాలకు చేరే మార్గం తెలియక తిప్పలుపడ్డారు. శుక్రవారం అమరావతిలో నిర్వహించిన కార్యక్రమం కోసం మార్కాపురం డిపో నుంచి 30 బస్సులు, పొదిలి డిపో నుంచి సుమారు 40 బస్సులు, గిద్దలూరు డిపో నుంచి 30 బస్సులు, ఒంగోలు నుంచి సుమారు 50 బస్సులు పంపారు. దీంతో ఉదయం నుంచే బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు, ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

మార్కాపురం నుంచి ఒంగోలు, మార్కాపురం-గిద్దలూరు, మార్కాపురం-దోర్నాల, మార్కాపురం- మాచర్ల తదితర రూట్లతోపాటు పలు గ్రామాలకు వెళ్లే పల్లెవెలుగు బస్సులను సైతం పల్నాడు జిల్లాకు పంపడంతో బస్టాండులో ప్రయాణికులు పడిగాపులు కాయక తప్పలేదు. ప్రయాణికులతో మార్కాపురం బస్టాండ్ ప్రాంగణం నిండిపోయింది. పొదిలి డిపోలో ఒంగోలు, అద్దంకి, కనిగిరి వైపు వెళ్లే ప్రయాణికులు బస్సుల రాక కోసం పడిగాపులు కాశారు. సహనం నశించిన ప్రయాణికులు బస్టాండ్ బయట ఆటోలను ఆశ్రయించి గమ్యస్థానాలకు వెళ్లారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు ఆర్టీసీ డిపో ప్రయాణికులతో కిక్కిరిసింది. తిరిగిన ఒకటీ రెండు బస్సుల్లో ఎక్కేందుకు ప్రయాణికులు ముష్టి యుద్ధానికి దిగాల్సి వచ్చింది. ఓ వైపు మండుతున్న ఎండలో చెమటలు కక్కుతూ బస్సుల్లో చోటు కోసం వెంపర్లాడిన ప్రయాణికులు 'ఇదేం ఖర్మరా బాబు..' అంటూ అసహనం వ్యక్తం చేశారు


మార్కాపురం: రాకరాక వచ్చిన బస్సులో హడావుడిగా ఎక్కుతున్న ప్రయాణికులు


పొదిలి డిపోలో బస్సు కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు


మార్కాపురం బస్టాండ్‌లో ప్రయాణికుల పడిగాపులు

అధికారులపై ఎంపీపీ దౌర్జన్యం

తాళ్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దౌర్జన్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఏం చేసినా చెల్లుతుందని పచ్చ నేతలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రం తాళ్లూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం సాయంత్రం ఎంపీపీ తాడికొండ శ్రీనువాసరావు ప్రభుత్వ అధికారులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. అమరావతిలో మోదీ కోసం కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజధాని పునఃనిర్మాణ కార్యక్రమానికి ప్రజలను తరలించేందుకు వాహనాలు ఏర్పాటు కోసం అధికారులు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ సంజీవరావు, ఎంపీడీవో దారా హనుమంతురావు, ఎంపీపీ తాడికొండ శ్రీనివాసరావుతో పాటు పలువురు కూటమి నాయకులు చర్చించుకుంటున్నారు. గత నెల జీతాలు ఇప్పించాలని విలేజ్ సర్వేయర్లు తహసీల్దార్ వద్దకు వచ్చి విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ జోక్యం చేసుకొని తాము చెప్తేనే జీతాలు ఇవ్వాలన్నారు. ఒక రెవెన్యూ ఉద్యోగి కలుగజేసుకొని సార్..జీతాలు ఆగితే కుటుంబ పోషణకు ఇబ్బంది అవుతుందని, జీతాలు ఎలా ఆపుతారని ప్రశ్నించారు. ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీపీ.. సదరు రెవెన్యూ అధికారిపై ఆవేశంతో ఊగిపోయారు. ఎంపీపీ వ్యవహరించిన తీరుపై మరో ప్రభుత్వ ఉద్యోగి ఇదెక్కడి న్యాయం .. అని నిలదీశాడు. ఓ సర్పంచ్ కలగజేసుకుని సదరు ప్రభుత్వ ఉద్యోగిపై దౌర్జన్యానికి దిగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. కళ్లముందే ఇంత జరుగుతున్నా ఏమీ చేయలేని స్థితిలో ఎంపీడీవో, తహసీల్దార్ ఉన్నారు.

పిడుగుల వానకు మూగజీవాలు బలి

- కనిగిరి మండలంలో 20 మేకలు మృతి
- కొమరోలు మండలంలో 2 గేదెలు, 2 దూడలు మృతి
- రెండు ఘటనల్లో బాధితులకు రూ.8 లక్షల మేర నష్టం
- ఈదురు గాలుల ధాటికి మిద్దెపై నుంచి పడి మరణించిన వృద్ధురాలు


కనిగిరి : మృతి చెందిన జీవాల వద్ద రోదిస్తున్న బాధిత కుటుంబం

కనిగిరి రూరల్/కొమరోలు: కనిగిరి ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతోపాటు పిడుగులు పడ్డాయి. దాదాపు గంటకు పైగా భారీ వర్షం కురిసింది. ఉదయం 6.30 గంటల సమయంలో మండలంలోని పోలవరం పంచాయతీ కలగట్ల సమీప పొలాల్లో నూకతోటి శివపార్వతమ్మకు చెందిన గొర్రెల మంద దొడ్డిపై పిడుగు పడింది. దీంతో 20 మేకలు మృతి చెందాయి. సుమారు రూ.5 లక్షల మేర నష్టం జరిగిందని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఘటనా స్థలాన్ని పశు వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అంకమ్మరాజు పరిశీలించారు.

కొమరోలు మండలంలో..

కొమరోలు మండలంలో గురువారం రాత్రి ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. తాటిచెర్ల మోటు గ్రామంలో పిడుగు పడటంతో రెండు గేదెలు, రెండు దూడలు మృతిచెందాయి. రూ.3 లక్షల విలువైన పశువులు మృత్యువాత పడ్డాయని బాధిత రైతు గుమ్మళ్ల శింగరయ్య కన్నీటి పర్యంతమయ్యాడు.

మిద్దెపై నుంచి పడి వృద్ధురాలు..

పని నిమిత్తం మిద్దెపైకి ఎక్కిన ఓ వృద్ధురాలు బలమైన ఈదురు గాలుల ధాటికి కిందపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. సర్విరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గుడిమి సుశీలమ్మ(70) కుటుంబ సభ్యులతో కలిసి కొమరోలులోని గీతామందిరం వద్ద సొంత ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటోంది. గురువారం రాత్రి వర్షం మొదలయ్యే తరుణంలో మిద్దెపై ఆరబెట్టిన పసుపు కొమ్ములు తెచ్చేందుకు వెళ్లింది. అదే సమయంలో బలమైన గాలులు వీయడంతో అదుపుతప్పి మిద్దెపై నుంచి కిందపడింది. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన 108 అంబులెన్స్‌లో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుశీలమ్మ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సుశీలమ్మకు భర్త, 8 మంది సంతానం ఉన్నారు.


కొమరోలు : పిడుగుపాటుకు మృతిచెందిన గేదె


మృతి చెందిన సుశీలమ్మ

వృద్ధుడి అనుమానాస్పద మృతి

ఒంగోలు టౌన్: నగర శివారులో వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన షేక్ మహబూబ్ బాషా (65) భార్య చనిపోవడంతో కొన్నేళ్లుగా ఇందిరా కాలనీలో ఉన్న కుమార్తె వద్ద నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసైన అతడు ఇంట్లో భోజనం చేసి వచ్చి ఫ్లయి ఓవర్ బ్రిడ్జి కింద పడుకుంటుంటాడు. ఎప్పటిలాగే రాత్రి పడుకున్న బాషా శుక్రవారం తెలవారుజామున నిర్జీవంగా కనిపించాడు. ఒంటిపై గాయాలు ఉండటంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని తాలుకా సీఐ అజయ్‌కుమార్ పరిశీలించారు. పోలీసు డాగ్‌ను రంగంలోకి దించారు. బ్రిడ్జి కింద మందుబాబులు, గంజాయి తాగే వారు తరుచూ ఘర్షణ పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గురువారం పింఛన్ రావడంతో జేబులో డబ్బుల కోసం ఎవరైనా హత్య చేశారా, లేక మద్యం ఎక్కువై మరణించాడా..అన్నది తేలాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


కొప్పోలు బ్రిడ్జి కింద బాషా మృతదేహం

కనిగిరిలో పిచ్చికుక్క స్వైర విహారం

- 25 మందికి గాయాలు
- నిద్రావస్థలో మున్సిపల్ అధికారులు

కనిగిరి రూరల్: పట్టణంలో శుక్రవారం ఓ పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. పాతూరు, సుగుణావతమ్మ సెంటర్, బొడ్డుచావిడి వీధి, రామయ్య నాయుడు ఆస్పత్రి వీధి తదితర ప్రాంతాల్లోని పాదచారులు, మహిళలు, చిన్నారులపై దాడి చేసింది. నాదేళ్ల శ్రీనివాసులు, ఎం.రామకోటేశ్వరరావు, టంగుటూరి వెంకట శేషయ్య, పావెల్ల మంజుల, గంగిశెట్టి దేవసేన, చింటు, కొండయ్యతో పాటు మరో 19 మందికి గాయాలయ్యాయి. కాళ్ల వద్ద, చేతులు, మోకాళ్లపై ఎక్కడ పడితే అక్కడ కరిచింది. క్షతగాత్రులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లారు. చింటు, కొండయ్యలకు తీవ్రగాయలు కావడంతో ఆస్పత్రిలోనే ఉండి చికిత్స పొందుతున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. పట్టణంలో ప్రతి నెలా కుక్కలు ప్రజలపై దాడులు చేస్తున్నా మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకులు స్పందించి ప్రజాసంరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కుక్క కాటుతో గాయపడిన బాలుడు




కాళ్ల వద్ద, మోకాలిపై కుక్క కాట్లు

గేదె పొడిచి యువకుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

దొనకొండ: బైకుపై వెళ్తున్న యువకుడిని గేదె పొడవడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపేట గ్రామానికి చెందిన పోలు నతానియేలు (23) ద్విచక్ర వాహనంపై అదే గ్రామానికి చెందిన మరియబాబును ఎక్కించుకుని కొనకనమిట్ల మండలం సిద్ధవరం గ్రామానికి వెళ్తున్నాడు. ఆరవల్లిపాడు సమీపంలో గేదెల గుంపులోని ఒక గేదె బైకుపై ఉన్న నతానియేలును పొడిచింది. ఆయన ఎడమ వైపు కాలర్ బోన్ కింద భాగంలో తీవ్ర గాయమైంది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. నతానియేలు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై త్యాగరాజు తెలిపారు.

రేపు సింగరాయకొండలో

సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

- హాజరు కానున్న హైకోర్టు జడ్జిలు

సింగరాయకొండ: కొండపి నియోజకవర్గ ప్రజల కల అయిన సివిల్ జడ్జి కోర్టు(జూనియర్ విభాగం) ఆదివారం సింగరాయకొండలో ప్రారంభం కానున్నట్లు స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు జడ్జి, ప్రకాశం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి టి.రాజశేఖరరావు, హైకోర్టు జడ్జిలు డాక్టర్ కె.మన్మథరావు, జి.రామకృష్ణ ప్రసాద్, డాక్టర్ వై.లక్ష్మణరావు, జిల్లా జడ్జి భారతి పాల్గొంటారని వివరించారు.

ఐదు మండలాలకు ప్రయోజనం

సింగరాయకొండలో సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుతో సింగరాయకొండ, జరుగుమల్లి, టంగుటూరు, కొండపి, పొన్నలూరు మండలాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఈ ఐదు మండలాల పోలీస్‌స్టేషన్లతో పాటు సింగరాయకొండ ఎక్సైజ్ సర్కిల్ పోలీస్‌స్టేషన్ కూడా ఈ కోర్టు పరిధిలోకి వస్తుంది. ఐదు మండలాలు నూతన కోర్టు పరిధిలోకి రావడంతో కేసులు త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సింగరాయకొండ, జరుగుమల్లి, పొన్నలూరు, కొండపి మండలాలు కందుకూరు కోర్టు పరిధిలో, టంగుటూరు మండలం ఒంగోలు కోర్టు పరిధిలో ఉండేవి. ఈ కోర్టు ఏర్పాటుతో సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి కందుకూరు కోర్టుతో ఇక ఎటువంటి సంబంధం ఉండదు. ఈ కోర్టులో వచ్చే తీర్పులకు అప్పీలు చేసుకోవాలన్నా అప్పిలేట్ కోర్టుగా ఒంగోలు కోర్టు ఉంటుందని న్యాయవాదులు వివరించారు. ప్రస్తుతం ఐదు మండలాల్లో సుమారు 4 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారు.


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు